# సైన్యానికి సలామ్

## 'ఆపరేషన్ సిందూర్'కు సినీ తారల సంఘీభావం

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు యావత్ సినీ ప్రపంచం మద్దతుగా నిలుస్తున్నది. ఉగ్రదాడికి సరైన సమాధానమిదని సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత సైన్యం పోరాటపటిమను కొనియాడుతూ 'జై హింద్' 'భారత్ మాతాకీ జై' హ్యాష్‌టాగ్‌లతో పలువురు సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. భారత సైన్యం దేశం గర్వపడేలా చేసిందని, నిజమైన హీరోలకు సెల్యూట్ అంటూ సైనిక చర్యను అభినందిస్తున్నారు.

'ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. లక్ష్యం పూర్తయ్యే వరకు ఆగదు. దేశం మొత్తం సైన్యానికి తోడుగా ఉంది' **–రజనీకాంత్**

'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలి. జై హింద్' **– చిరంజీవి**

'భారతీయులు సిందూరాన్ని తిలకంగా మాత్రమే కాదు...అంతులేని సంకల్ప బలానికి ప్రతీకలా ఉపయోగిస్తారు. ఎన్ని కష్టాలు ఎదురైనా గతంలో కంటే బలంగా ముందుకొస్తాం. త్రివిధ దళాల్లోని ప్రతి సైనికుడికి నా వందనాలు. మిమ్మల్ని చూసి దేశం గర్విస్తున్నది' **–మోహన్‌లాల్**

'భారత సైన్యాన్ని చూసి దేశం మొత్తం గర్విస్తున్నది. ఉగ్ర చర్యలు భారతీయుల సంకల్ప బలాన్ని దెబ్బతీయలేవు. భారత ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక సైనిక చర్యను అభినందిస్తున్నా' **– కమల్‌హాసన్**

''ఆపరేషన్ సిందూర్' దేశ ప్రజల్లో స్ఫూర్తినింపింది. త్రివిధ దళాల ధైర్యానికి హ్యాట్సాఫ్. మేమంతా మీ వెంటే ఉన్నాం' **–పవన్‌కల్యాణ్**

'ఈ రోజు న్యాయం గెలిచింది. జైహింద్' **– అల్లు అర్జున్**

'ధర్మం సైనికుల రూపంలో పోరాడుతున్నది. దేశం మొత్తం మీతోనే ఉంది. సైనికులకు వందనాలు' **–మహేష్‌బాబు**

''ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యం విజయం సాధించాలని, వారు క్షేమంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా. జైహింద్' **–ఎన్టీఆర్**

'మేం నిబద్ధతతో ఉంటాం. ఉగ్రవాదాన్ని రూపుమాపాలనే లక్ష్యంతో భారత్ ఈ ఆపరేషన్ చేపట్టింది. లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో భారత సైన్యం ఎంతో సంయమనం పాటించింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా మాత్రమే ఈ చర్యలు చేపట్టింది' **– ప్రకాష్‌రాజ్**

'ఎలాంటి దాడులు, ఉగ్రవాదం లేకుండా ప్రజలు ప్రశాంతంగా గడిపే రోజులు రావాలని కోరుకుంటున్నా. ప్రజల భద్రత కోసం దేవున్ని ప్రార్థిద్దాం. భవిష్యత్తుపై ఆశతో సుసంపన్నంగా అందరూ జీవించాలి. జై హింద్' **– విజయ్ దేవరకొండ**

'ఈ దేశంలో ఉగ్రవాదానికి చోటు లేదు. ఇక ఎవరినీ ఉపేక్షించబోం. ఈ చర్యతో పహల్గాం మృతులకు న్యాయం జరిగింది' **– సునీల్‌శెట్టి**

'జై హింద్. ఆపరేషన్ సిందూర్' **–నాని**

'ఇదీ భారత సైన్యం సత్తా. జైహింద్' **–శివకార్తికేయన్**

'దేశంకోసం పోరాడుతున్న రియల్ హీరోలకు సెల్యూట్. మనకోసం సైన్యం ఏం చేయగలదో ఈ ఆపరేషన్‌తో నిజమైంది. దేశం గర్వపడేలా చేశారు' **– మమ్ముట్టి.**

'మనమంతా భారత్‌సైన్యం వెంటే ఉందాం. జై హింద్, జై మహాకాళి' **–అక్షయ్ కుమార్**

'భారత సైన్యం అద్భుతమైన కచ్చితత్వంతో ఆపరేషన్‌ను చేపట్టింది. మన రక్షణకు ఆర్మీ అహర్నిశలు శ్రమిస్తున్నది. మనం వారిని రక్షించుకుందాం' **– కంగనా రనౌత్**

'మరోమారు తీవ్రవాద ఘటనలు పునరావృతం కావొద్దు. ఇండియన్ ఆర్మీకి మనందరం మద్దతుగా నిలుద్దాం. ఈ తరుణంలో దేశం మొత్తం ఒక్కతాటిపై నిలిచి సంకల్పబలాన్ని చాటుదాం' **– రాజ్‌కుమార్ రావు**

## రాజమౌళి సినిమా తర్వాత?



ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో నటిస్తున్నారు అగ్ర హీరో మహేష్‌బాబు. రెండు షెడ్యూల్స్ పూర్తి చేసిన చిత్రబృందం ఇటీవలే కొంచెం బ్రేక్ తీసుకుంది. జూన్‌లో మరో షెడ్యూల్‌ను మొదలుపెడతారని సమాచారం. ఇదిలావుండగా రాజమౌళి సినిమా అనంతరం మహేష్‌బాబు ప్రాజెక్ట్ ఏమిటి? ఏ దర్శకుడికి ఛాన్స్ ఇవ్వబోతున్నారు? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి. తాజా సమాచారం ప్రకారం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మహేష్‌బాబు సినిమా చేస్తారని సమాచారం. మహేష్‌బాబు 'వన్' సినిమాకు బుచ్చిబాబు సహాయ దర్శకుడిగా పనిచేశారు. అప్పటి నుంచే ఇద్దరికి సాన్నిహిత్యం ఉంది. 'ఉప్పెన' రిలీజ్ తర్వాత బుచ్చిబాబు వర్క్‌ని బాగా నచ్చడంతో 'మంచి కథ సిద్ధం చేసుకో. సినిమా చేద్దాం' అని మాటిచ్చారట మహేష్‌బాబు. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'పెద్ది' చిత్రాన్ని చేస్తున్నాడు బుచ్చిబాబు. ఇది పూర్తయిన వెంటనే మహేష్‌బాబుతో సినిమా చేసే అవకాశం ఉందంటున్నారు. రాజమౌళి-మహేష్‌బాబు సినిమా పూర్తవడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందని, ఆలోగా బుచ్చిబాబు స్క్రిప్ట్‌తో సిద్ధంగా ఉంటారని ఫిల్మ్‌నగర్ టాక్. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రం వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

## నవ్వించడమే 'సింగిల్' లక్ష్యం

'నేను ఇండస్ట్రీకొచ్చి పదహారేండ్లయింది. ప్రేక్షకులు బోర్ ఫీలవకుండా ప్రతీ కథలో వైవిధ్యాన్ని చూపించే ప్రయత్నం చేశా. భవిష్యత్తు ఫిల్మ్‌మేకింగ్‌లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయి. అందుకు నేను సిద్ధంగా ఉన్నా' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన తాజా చిత్రం 'సింగిల్' ఈ నెల 9న ప్రేక్షకులకు ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం శ్రీవిష్ణు విలేకరులతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.



రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని నవ్వించాలనే ఏకైక లక్ష్యంతో తీసిన సినిమా ఇది. కథ, స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా సన్నివేశాలుంటాయి. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కూడా బాగా కనెక్ట్ అవుతుంది.

టైటిల్ 'సింగిల్' అని ఉన్నా..ముక్కోణపు ప్రేమకథగా నడుస్తుంది. క్లైమాక్స్ చాలా కొత్తగా అనిపిస్తుంది. నేను, ఇద్దరు నాయికలు, వెన్నెల కిషోర్..ఈ నాలుగు పాత్రలు ఆద్యంతం నవ్వుల్ని పంచుతాయి. వెన్నెల కిషోర్ క్యారెక్టర్ కథలో చాలా కీలకంగా ఉంటుంది. ఆయన ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ అయిన తర్వాత సినిమాకు కొత్త జోష్ వచ్చింది.

షూటింగ్ మొత్తం హైదరాబాద్‌లోనే జరిగింది. ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌ను ఇంత కొత్తగా ఎవరూ చూపించలేదనిపించింది. ఇక్కడి పాపులర్ లొకేషన్స్‌ను బాగా కవర్ చేశాం. సిటీలైఫ్‌లోని బెస్ట్ మూమెంట్స్‌ను క్యాప్చర్ చేశాం.

సినిమాల్లో నా డైలాగ్ డిక్షన్‌ని యూత్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్లకోసమే సంభాషణల విషయంలో నేను ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నా. వీలైనంత వరకు ప్రేక్షకుల్ని నవ్వించాలన్నదే నా ఉద్దేశ్యం. గత చిత్రాలతో పోల్చితే ఈ సినిమాలో నేను డిఫరెంట బాడీలాంగ్వేజ్‌తో కనిపిస్తాను.

కథల విషయంలో ప్రయోగం చేసి ఫెయిల్ అయితే బాధపడకుండా దాన్నొక ఎక్స్‌పీరియన్స్‌గా తీసుకోవాలి. అంతేకాని కొత్త ప్రయత్నాల్ని మాత్రం మానుకోవద్దు. ప్రస్తుతం 'మృత్యుంజయ' అనే థ్రిల్లర్ చేస్తున్నా. ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో పాటు ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా చేస్తున్నా.

## మిస్టిక్ థ్రిల్లర్ మొదలైంది




నాగచైతన్య నటిస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా తాలూకు షూటింగ్ బుధవారం మొదలైంది. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారరు. 'ఎన్‌సీ 24' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. భారతీయ మూలాలు, ఫాంటసీ అంశాలు కలబోసిన మిస్టిక్ థ్రిల్లర్ చిత్రమిది. ట్రెజర్ హంట్ నేపథ్యంలో కథ సాగుతుందని, ఇందులో నాగచైతన్య హిస్టరీ స్టూడెంట్ పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ ప్రాధాన్యత ఉంటుంది. షూటింగ్ మొదలైన సందర్భంగా హీరో నాగచైతన్య తన సోషల్‌మీడియా ఖాతాలో పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నీల్ డి కున్హా, సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, దర్శకత్వం: కార్తీక్ దండు.

## ముచ్చటగా మూడోసారి?



సినీరంగంలో కొన్ని కాంబినేషన్‌లకు తిరుగులేని క్రేజ్ ఉంటుంది. అలాంటి వాటిలో విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఒకటి. వీరిద్దరు కలిసి నటించిన 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' చిత్రాలు మంచి విజయాల్ని సాధించాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సక్సెస్‌ఫుల్ జోడీ మరోమారు వెండితెరపై సందడి చేయబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రంలో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా అనంతరం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ పీరియాడిక్ చిత్రంలో నటించనున్నారు విజయ్ దేవరకొండ. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ఈ చిత్రంలో కథానాయికగా రష్మిక మందన్నను ఖరారు చేసినట్లు వార్తలొస్తున్నాయి. కథానాయిక అన్వేషణలో చాలా మంది పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు రష్మిక మందన్న వైపు మొగ్గుచూపారని చెబుతున్నారు. ఈ సినిమా త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో 'గర్ల్‌ఫ్రెండ్', హిందీలో 'తమా' చిత్రాల్లో నటిస్తున్నది.

## అమెరికాలో 'కన్నప్ప' ప్రచారం



మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకుడు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. జూన్ 27న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నెల 8న అమెరికా న్యూజెర్సీలో ఈ సినిమా ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు మంచు విష్ణు. ఆ తర్వాత డల్లాస్, టెక్సాస్, శాన్ ఫ్రాన్సిస్కోల్లో అభిమానులను కలుసుకొని ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. ఓవర్సీస్‌లో కూడా భారీ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే భక్తిరస కావ్యమిదని, పాటలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని చిత్రబృందం పేర్కొంది. మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## సందేశంతో 'సీఎం పెళ్లాం'



ఇంద్రజ, అజయ్ జంటగా నటించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. రమణారెడ్డి దర్శకత్వంలో బీఆర్‌కే నిర్మించారు. ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు రమణారెడ్డి మాట్లాడుతూ 'ఎలక్షన్లు రాగానే ఎమ్మెల్యేగా పోటీ చేసే వ్యక్తి మాత్రమే కాకుండా ఆయన సతీమణి కూడా ఓట్లు అడగడం చూస్తుంటాం. కానీ గెలిచిన తర్వాత ఎంత మంది మళ్లీ వచ్చి ఓటర్లను కలుస్తున్నారు? అనే ప్రశ్నను ఈ సినిమా ద్వారా అడుగుతున్నాం. రాజకీయ నేపథ్యంలో సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించాం. అలాగే పవర్‌లో ఉన్నవారు బూతులు మాట్లాడితే అధికారం నుంచి తొలగించాలనే చట్టం ఉండాలనే అంశాన్ని కూడా సినిమాలో చర్చించాం. వినోదప్రధానంగా సాగుతూనే చక్కటి సందేశం ఉంటుంది' అన్నారు. గొప్ప సందేశంలో ఉన్న సినిమాలో నటించడం ఆనందంగా ఉందని అజయ్ తెలిపారు. ప్రజల్లో మార్పు రావాలని ఆశించి ఈ సినిమా తీశామని నిర్మాత రామకృష్ణ అన్నారు.

## దేశభక్తి ప్రధానంగా '6జర్నీ'



టెర్రరిజం నేపథ్యంలో '6జర్నీ' చిత్రాన్ని రూపొందించామని చెప్పారు దర్శకుడు బసీర్ ఆలూరి. రవిప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యారెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ఈ నెల 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ ఆలూరి చిత్ర విశేషాలను పంచుకున్నారు. దర్శకుడిగా తనకిది మూడో చిత్రమని, గోవా టూర్‌ను ఎంజాయ్ చేసి ఆత్మహత్య చేసుకోవాలనుకునే ఆరుగురి స్నేహితుల కథ ఇదని తెలిపారు. ఈ ప్రయాణంలో వారు ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నారన్నది ఆసక్తికరంగా ఉంటుందన్నారు. 'క్లైమాక్స్‌ను సందేశాత్మకంగా తెరకెక్కించాం. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా యువత ఎలాంటి పోరాటం చేయాలనే అంశాల్ని చూపించాం. క్లైమాక్స్ ఘట్టాలు దేశభక్తిని పెంపొందిస్తాయి. బోర్డర్‌లో తెరకెక్కించిన సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి. ముంబయి బ్యాక్‌డ్రాప్‌లో అక్టోబర్‌లో కొత్త చిత్రానికి సన్నాహాలు చేస్తున్నా' అని బసీర్ చెప్పారు.

## యథార్థ సంఘటనలతో '23'



''మల్లేశం' చిత్రంతో నా కెరీర్‌కు కొత్త ఊపిరినిచ్చారు దర్శకుడు రాజ్. ఆ కృతజ్ఞతతోనే ఈ వేడుకకు వచ్చాను. '23' చాలా గొప్ప కథ. ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల ఈ సినిమా చేయడం కుదరలేదు. చరిత్రకు సంబంధించిన ప్రశ్నల్ని అడగడం చాలా అవసరం. అది ఈ సినిమా ద్వారా సాధ్యమైంది' అన్నారు ప్రియదర్శి. మంగళవారం జరిగిన '23' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ప్రియదర్శి, గీత రచయిత చంద్రబోస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 16న '23' విడుదలకానుంది. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబోస్..సృజనాత్మకతకు పెద్దపీట వేసే దర్శకుడు రాజ్ అని కొనియాడారు. థియేటర్‌లోనే చూడాల్సిన చిత్రమిదని, యథార్థ సంఘటనల స్ఫూర్తితో, సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కించామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

